


# వీడ్కోలు

మిత్రమా!!
నీ రాకకూ నా పోకకూ మధ్య ఒకే ఒక
లిప్త!
బుడగలు పేల్చి నన్ను సాగనంపడానికీ,
కొవ్వొత్తులతో నిన్ను ఆహ్వానించడానికీ,
వాళ్లెంత ఉబలాటపడుతున్నారో
చూశావా?
ప్రతివారి ముఖంలోనూ ఆనందం,
ఉత్కంఠ
ఏదో తెలియని ఆవేశం
ఉద్వేగాల మాటున ఆశ!
సరిగ్గా సంవత్సరం క్రితం
నాకూ ఇలాంటి ఆహ్వానమే. ఎన్నో
ఆశలతో!
మనం వాళ్ల ఆశలన్నీ నెరవేర్చాలని
కోరుకుంటారు
వాళ్లకి జరిగిన మంచికీ, చెడుకీ మనల్నే
బాధ్యుల్ని చేస్తారు

అమాయకులు!
వాళ్లకే తెలుసు, మనం
నిమిత్తమాత్రులమని!
నాకు కొన్ని తిట్లూ, కొన్ని ప్రశంసలూ!!
నీకూ అంతే!
అసలు యుగయుగాలుగా అంతే!
నువ్వూ నేనూ ఎప్పుడూ ఒకర్నొకరు
చూసుకునే అవకాశం లేకపోయినా,
నీకన్నీ ప్రశంసలే లభించాలని
ఆశిస్తూ
గత సంవత్సరం

- కె.ఎస్.ఎన్.రాజేశ్వరి
0891-2755343

# కోరిక

కోరికలకేం తెలుసు?
మధ్యతరగతిని అంటిపెట్టుకుంటే
ఏమీ ఉపయోగం ఉండదని
కలల్లో కాలం గడుపుతూ
మేల్కొని మర్చిపోతారని...
జీవితకాలాన్ని వ్యర్థం చేస్తారనీ
అసలు.. కోరికలే లక్ష్యంగా..
కావలసిన వనరులని సమీకరించుకుని
ఏకాగ్రచిత్తంతో అహర్నిశం అప్రమత్తంగా
వుంటూ
సుదృఢంగా అడుగులేస్తే..
అనుకున్నదానిని చేరుకోవడం ఖాయం
మిన్నంటిన కరతాళధ్వనులు
అభినందనల పరంపరల మధ్య
ఆ మధురానుభూతికి కారణం
కోరికేనన్నది మర్చిపోతాం గానీ
మధ్యతరగతికి కోరికలన్నది శాపం కాదు
ఓ వరం.. సద్వినియోగం చేసుకుంటే!

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు
93939 81918